క్లుప్తంగా

యోగాతో ప్రశాంతత



విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న దృశ్యం

శ్రీశైలంప్రాజెక్ట్: నిత్యం యోగా చేయడం వల్ల శారీరక, మానసిక ప్రశాంతతను పొందవచ్చని శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్‌బాషా తెలిపారు. సోమవారం కళాశాలలో యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు కాసేపు యోగాసనాలు వేయాలన్నారు.

మహానందిలో భక్తజనసందడి



మహానందీశ్వరస్వామి దర్శనానికి వెళ్తున్న భక్తులు

మహానంది: మహానంది ఆలయంలో సోమవారం భక్తులరద్దీ నెలకొంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, శీఘ్రదర్శనం తదితర ఆర్జిత సేవా టికెట్ల ద్వారా భక్తులు గంటల తరబడి వేచి ఉండి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా వర్షం వల్ల పల్లకీసేవ కార్యక్రమం రద్దు చేసినట్లు ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.

వేలంపాటలో తగ్గిన ఆదాయం



కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో సోమవారం నిర్వహించిన దేవస్థానం భూముల బహిరంగ వేలం పాటల్లో ఆదాయం తగ్గిందని ఈఓ వెంకటరమణ తెలిపారు. గ్రామ దేవతలు ఎల్లమ్మ, కేశవరామచంద్ర ఆంజనేయ స్వామి, ఈశ్వరస్వామి దేవస్థానములకు చెందిన 113 ఎకరాలకు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. 45 మంది రైతులు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారు. కాగా గత ఏడాది రూ.14.48 లక్షలకు పొలాలను కౌలుకు దక్కించుకోగా ఈ ఏడాది రూ.12.89 లక్షలకు దక్కించుకున్నట్లు ఈఓ తెలిపారు.

క్షయ వ్యాధిని తరిమేద్దాం




క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: క్షయ వ్యాధిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డాక్టర్లు తిరుపతి, భరత్ సూచించారు. సోమవారం మిడుతూరు ప్రభుత్వ వైద్యశాలలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శారద, సాయిసుధా, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంజన్నకు పూజలు

ఆత్మకూరు: పట్టణంలోని అభయాంజనేయ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు అనిల్‌కుమార్‌శర్మ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ మౌని అమావాస్య, శని జయంతి కలిసి రావడంతో అమావాస్య శక్తివంతమైందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి పూజల్లో పాల్గొనాలన్నారు.

పైపులకు మరమ్మతులు



పైపులకు వెల్డింగ్ చేస్తున్న దృశ్యం

పాములపాడు: స్థానిక కేసీ కెనాల్ బ్రిడ్జిపై లీకేజీ అవుతున్న పైపులకు సోమవారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నాగశేషులు మాట్లాడుతూ ఎస్సీ కాలనీలోని ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుకు నీటిని ఎక్కించే పైపులైన్‌కు రంధ్రాలు పడటంతో నీరు లీకవుతోందన్నారు. గ్రామంలోని వీధి కుళాయిలకు సరఫరా చేసే పైపుల నుంచి కూడా నీరు లీకవుతోందన్నారు. దీంతో జీఐ పైపులను వెల్డింగ్ చేయడంతో పాటు నూతన పైపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక నుంచి నీరు సాఫీగా సరఫరా అవుతుందన్నారు.

రుతు రాగం!

- రోహిణి కార్తెలో జోరుగా వర్షాలు
- నాలుగు రోజులుగా ఆత్మకూరు డివిజన్‌లో విస్తారంగా కురుస్తున్న వర్షాలు



ఆత్మకూరులో కురుస్తున్న వర్షం

ఆత్మకూరు: ఈ యేడాది వేసవి ప్రారంభంలో ఎండలు మండాయి. మార్చి నెలలోనే ఎండలు తీవ్ర ప్రభావం చూపడంతో మే నెలలో ఏ స్థాయిలో ఉంటాయోనని భయాందోళనకు గురయ్యారు. ఇక కృతిక, రోహిణి కార్తెల్లో రోళ్లు పగిలే ఎండలు ఉంటాయని పెద్దల నానుడి. కానీ వాతావరణ మార్పుల వల్ల ఈ యేడాది ఏప్రిల్ నుంచి భారీ వర్షాలు కురవడంతో ఆత్మకూరు డివిజన్‌లో ఎండలు ప్రభావం కనిపించలేదు. ఏప్రిల్‌లో సాధారణ వర్షపాతం 16 మి.మీ. కురవాల్సి ఉండగా రికార్డుస్థాయిలో 95 మి.మీ.కు పైగా వర్షం కురిసింది. ఇక మే నెలలో కేవలం 26 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 120 మి.మీ. వర్షం కురిసింది. దీంతో మండే ఎండలు ఉండాల్సిన మే నెలలో చల్లదనం సంతరించుకుంటోంది.

పదేళ్ల తరువాత..

రోహిణికార్తెలో ఎండలు లేకపోవడం దాదాపు 10 ఏళ్ల క్రితం జరిగిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. 2009లో రుతుపవనాలు మే నెలలోనే తాకడం, ఈ యేడాది రుతుపవనాలు ముందుగా రావడంతో ఉపరితల ఆవర్తనం బంగాళాఖాతంలో ఏర్పడడంతో రాయలసీమ ప్రాంతంలో మళ్లీ వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఈనెల 31వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు

ఈ యేడాది ముందస్తు వర్షాలు పడడంతో ఆత్మకూరు, పాములపాడు, కొత్తపల్లె, వెలుగోడు మండలాల్లో భూగర్భ జలాలు ఎన్నడూలేనివిధంగా భారీ స్థాయిలో పెరిగాయి. బోరుబావుల్లో పూర్తిస్థాయికి నీటిమట్టం చేరుకోనుంది. ఫలితంగా రైతన్నలు ఖరీఫ్ సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. మొక్కజొన్న, పత్తి, కంది పంటలను వేసుకునేందుకు రైతులు సిద్ధమయ్యారు. కాగా తుంగభద్ర, కృష్ణా నదికి వర్షపు నీరు వస్తే కేసీ కెనాల్, తెలుగంగకు నీరు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ యేడాది ఈ రెండు నెలలు భారీ వర్షాలు కురవడం చూస్తే రైతులు సంబరపడుతున్నారు. పంటలు సాగు చేసిన తర్వాత వర్షాలు కురుస్తాయోలేదోనన్న అనుమానం కూడా మరోవైపు రైతుల్లో ఉంది.







మహానంది: మహానంది మండలంలో సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు జోరు వాన కురిసింది. ఎడతెరిపినివ్వకుండా వర్షం కురవడంతో మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. మహానందీశ్వరస్వామి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో చేసేదేమి లేక తడుచుకుంటూనే వెళ్లాల్సి వచ్చింది. కాగా ఒక పక్క వర్షం..మరోపక్క మేఘావృతమైన ఆకాశం మహానందీశ్వరుడి ఆలయ పరిసరాలకు మరింత శోభను తెచ్చాయి.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి



జూపాడుబంగ్లాలో తహసీల్దార్‌కు సమస్యలు విన్నవించుకుంటున్న ప్రజలు

జూపాడుబంగ్లా: ప్రజాసమస్యల పరిష్కారవేదిక(పీజీఆర్ఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌ను నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వీటినంత త్వరగా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చి పంపారు. కార్యక్రమంలో ఏఈలు బషీర్, నాగేంద్ర, జ్యోతి, ఐసీడీఎస్ నిర్మలమ్మ పాల్గొన్నారు.

- **పగిడ్యాల:** త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ ఏర్పాటులో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా ఒక్కో చోట ఒక్కోరకంగా రోడ్డును ఆక్రమించి స్తంభాలు వేస్తున్నారని ప్రాతకోట గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్ మధుకు ఫిర్యాదు చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రామస్తులు కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటులో క్షేత్రస్థాయిలో పనిచేసే కాంట్రాక్టర్, సిబ్బంది రోడ్డును ఆక్రమించి నిర్మించిన షాపుల యజమానుల వద్ద డబ్బు తీసుకుని స్తంభాలు వేస్తున్నారని ఫిర్యాదు చేశారు. తూర్పు ప్రాతకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ క్రిష్ణమూర్తిని బదిలీ చేయొద్దని గ్రామస్తులు అర్జీ ఇచ్చారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఏఈలు శివకుమార్, జావేద్, ఎంఈఓ 2 మురళీమోహన్‌రెడ్డి, ఏపీఎం మద్దిలేటి, ఏపీఓ చంద్రకళ, ఐసీడీఎస్ సూపర్వైజర్ శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.
- **కొత్తపల్లి:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ మేరి వినతులు స్వీకరించారు. ఇద్దరు రైతులు భూమి సర్వే కోసం, ఒక రైతు భూమి ఆన్‌లైన్ సమస్య పరిష్కారం కోసం వినతులు ఇచ్చారని గడువులోపు పరిష్కరిస్తామని వారు తెలిపారు.

ఎడతెరిపినివ్వని వర్షం

జూపాడుబంగ్లా: మండలంలోని వర్షం ఎడతెరిపివ్వడం లేదు. చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం 13.8 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పగిడ్యాలలో అత్యధికంగా 19.2 మిల్లీమీటర్లు, పాములపాడు మండలంలో అత్యల్పంగా 6.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. నందికొట్కూరులో 18.2 మి.మీ, మిడుతూరులో 14.6 మి.మీ, జూపాడుబంగ్లాలో 13.8 మి.మీ, కొత్తపల్లిలో 10.6 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు.

ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

వెలుగోడు: గుంతకందాల గ్రామంలో వినాయక, సరస్వతీదేవి, గతుర్మంతుడు, ఆంజనేయస్వామి సహిత గోపాలకృష్ణ స్వామి ఆలయ, ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజతో ఉత్సవాలు మొదలుకాగా.. పుణ్యాహవాచనం, సంకల్పం, యాగశాలప్రవేశం, గోపుజ, మండల పడిపూజ, ద్వా తోరణపూజ, దీక్షావస్త్రధారణ, ఆచార్యాధి ఋత్విగంవరణం, నవగ్రహ కలశ స్థాపనం, ప్రధాన దేవతా, సర్వంతోభమండల దేవతా ఆరాధన, వాస్తు పూజాదికములు మంగళహారతి మహా నివేదనము, ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం జలాదివాసం, మత్స్యంగ్రహణం, అంకురార్పణం, ప్రదోషపూజ, దీక్షాహోమం, శాంతిహోమము మంగళహారతి, స్వస్తిమంత్రపుష్పం పూజలు నిర్వహించారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈనెల 28న యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

నందికొట్కూరు: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రఘురామమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసేంత వరకు ప్రజల తరఫున సీపీఐ పోరాడుతుందన్నారు. పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇస్తామని ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు శ్రీనివాసులు, రజిత, దినేష్, బాబురావు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



శిల్పాను కలిసిన మండల కమిటీ సభ్యులు

బండి ఆత్మకూరు: పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సూచించారు. ఇటీవల పార్టీ మండల కమిటీలో చోటు దక్కించుకున్న దూదేకుల బాబు, నాగేంద్ర నాయక్, శోభరాణి తదితరులు సోమవారం నంద్యాల ఉదయానంద రెసిడెన్సీలో శిల్పాను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వ పాలనను ఎండగడుతూ పార్టీ కోసం పని చేయాలని సూచించారు.

బీడు భూములకు సాగునీరు ఇవ్వాలి



మిడుతూరు రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నందికొట్కూరు: మిడుతూరు మండలంలోని బీడు భూములకు సాగు అందించేందుకు ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలని సీపీఐ (ఎంఎల్ లిబరేషన్) జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, ఎంసీపీఐయూ జిల్లా కన్వీనర్ లాజరస్ డిమాండ్ చేశారు. సోమవారం మిడుతూరు రెవెన్యూ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి వారు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ నుంచి మిడుతూరు మండల ప్రజలకు సాగు, తాగు నీరు అందిస్తామని, అలగనూర్ రిజర్వాయర్‌కు పడిన గండికి మరమ్మతులు చేసి సాగు అందిస్తామని ఎన్నికల ప్రచారం చేసి గద్దెనెక్కిన చంద్రబాబు నాయుడు ఏడాదవుతున్నా ఆ ఊసే ఎత్తకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించకపోతే రైతులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో వామపక్ష పార్టీ నాయకులు మద్రిస్వామి, శ్రీనివాసులు, డక్కా కుమార్, ఏసన్న, నరసింహులు, పెద్ద రాముడు, స్వాములు, సోమన్న, లింగన్న, మాబాషా, పుల్లారెడ్డి, లక్ష్మిదేవి, నాగమణి, మల్లమ్మ, చెంచమ్మ పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని రూపుమాపాలి



మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి

ఆత్మకూరు: ఉగ్రవాదాన్ని రూపుమాపాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యేసురత్నం, నరసింహానాయక్, కృషి పండ్లతోటల సంఘం అధ్యక్షులు మహబూబ్‌బాషా అన్నారు. సోమవారం పట్టణంలోని థెరిస్సా కాలేజీలో సీపీఎం ఆధ్వర్యంలో మత సామరస్యం వర్ధిల్లాలి... దేశ సమైక్యత సమగ్రత కోసం పాటుపడాలన్న నినాదంతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రజాక్, రామ్‌నాయక్, సురేంద్ర, జి.నాగేశ్వరరావు, వీరన్న, స్వాములు, వెంకటేశ్వర్లు, మాబాషా, సంజీవరాయుడు, దాసు, కిరణ్, పాలశివుడు, తుమ్మలూరు శివకుమార్ పాల్గొన్నారు.

మల్లన్నకు నృత్య నివేదన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై నెల్లూరుకు చెందిన గురుకృప కళాక్షేత్రం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వాతాపి గణపతిం, నమశ్శివాయ నటేశ్వరాయ, శివోహం, దేవీకౌత్వం, దేవానీలకంఠా, శివతాండవం, శివపంచాక్షరి తదితర గీతాలకు కావ్య, లహరి, జనని, నందన, మోక్ష, స్ఫూర్తి తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

నీటిముంపు బాధితులకు ఉద్యోగాలివ్వకపోతే
ఆమరణ దీక్షకు సిద్ధం



కోర్టు ఎదుట మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: శ్రీశైలం నీటిముంపు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని సీపీఎం నాయకులు ఫక్కీర్‌సాహెబ్ హెచ్చరించారు. సోమవారం సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిల కోర్టుల సముదాయము ఎదుట ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో నీటిముంపు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి నీటిముంపు నిరుద్యోగాలకు ఉద్యోగాలు ఇవ్వకపోతే బాధితులతో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో నీటిముంపు నిరుద్యోగుల సంఘం నాయకులు నారాయణరెడ్డి, నాగశేషసేనారెడ్డి, దరగయ్య, మగ్బూల్, వెంకటేష్, ఎల్లస్వామి, బాలకృష్ణ, కృష్ణా, రామారావు, నారాయణ, విగ్నేష్ పాల్గొన్నారు.

పరోక్షసేవగా వీరభద్రస్వామికి విశేషపూజ



వీరభద్రస్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర పాలకుడు బయలు వీరభద్రస్వామికి సోమవారం భక్తులు పరోక్షసేవగా విశేషార్చనను జరిపించుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే గాకుండా కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి 28 మంది భక్తులు పరోక్షసేవ ద్వారా పూజను జరిపించుకున్నారు. ముందుగా మహాగణపతిపూజ, అనంతరం పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో వీరభద్రస్వామివారికి అభిషేకం నిర్వహించారు.

భూమికి సారం..
రైతుకు సాయం

ఇబ్బడిముబ్బడిగా వాడిన రసాయన ఎరువులు.. ఏళ్లుగా ఒకే పంట సాగు చేయడం తదితర కారణాలతో ఏడాదికేడాది భూమి సారం తగ్గిపోతోంది. ఈ దశంలో పచ్చి రొట్ట ఎరువులు సాగు చేసి భూసారం పెంచుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పచ్చిరొట్ట సాగుతో భూసారం పెరగటంతోపాటు పంటలకు చీడపీడల బెడద తగ్గిపోయి అధిక దిగుబడులు వచ్చే అవకాశం మెండుగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి ఎం.స్వాతి పేర్కొంటున్నారు.

– బండిఆత్మకూరు

- పచ్చిరొట్ట సాగుతో అనేక ప్రయోజనాలు
- మండల వ్యవసాయాధికారి ఎం.స్వాతి



పచ్చిరొట్ట ఉపయోగించే జీలుగ పైరు

శ్రీశైలం నియోజకవర్గంలోని బండిఆత్మకూరు, వెలుగోడు, మహానంది, శ్రీశైలం, ఆత్మకూరు మండలాల్లో సుమారు 58,200 ఎకరాల్లో రబీ సీజన్‌లో వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి కోతలు పూర్తయిన నేపథ్యంలో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకునేందుకు ఇదే సరైన సమయం. వరి కోతల అనంతరం పొలాల్లో పదును ఉన్న సమయంలోనే పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే భూసారానికి ఎంతో మేలు చేకూరుతుంది.

భూమికి బలం

గతంలో రైతుల భూసారం పెరగడానికి పచ్చిరొట్ట పైర్లను రబీ పంటల అనంతరం వేసేవారు. ఇటీవల పచ్చిరొట్ట పైరుల పెంపకం తగ్గిపోయింది. దీనివల్ల భూసారం తగ్గి పంటలు తెగుళ్ల బారినపడుతున్నాయి. రైతులు తెగుళ్లను అరికట్టడానికి విచ్చలవిడిగా రసాయన మందులు పిచికారీ చేసే అనర్థాలను కొనితెచ్చుకుంటున్నారు. రబీకి ఖరీఫ్‌కు మధ్యలో పచ్చిరొట్ట పైర్లను పెంచడం వల్ల భూసారం పెరుగుతుంది.

స్థూల పోషకాలు అధికం

పచ్చిరొట్ట పైర్లు జనుము, జీలుగ, పిల్లి పెసర, ఉలవ, నీలి తదితర రకాలను ఖరీఫ్, రబీకి మధ్య సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకు పెంచి ఖరీఫ్ పంట వేసే ముందు భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం, భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 నుంచి 2 శాతం వరకు ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా భూమికి లభిస్తాయి. పంటల ఎదుగుదలకు ఈ మూడు పోషకాలు ఎంతో అవసరం. వీటి వల్ల నేలలో సంపూర్ణమై ఉత్పాదకత పెరుగుతుంది. భూమి లోపల నిక్షిప్తమైన పోషకాలను ఈ పైర్లు వెలికితీస్తాయి. ఈ పైర్ల సాగుతో 30 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. రైతులు ఆర్థికంగా లాభపడటానికి పచ్చిరొట్ట పైర్లు దోహదం చేస్తాయి. ప్రస్తుతం ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో పచ్చిరొట్ట పైర్ల సాగుతో ఎంతో మేలు జరుగుతుంది.

గుళికలతో నష్టం

ఖరీఫ్ రబీ పంటల్లో రైతులు గుళికలను అధికంగా వాడటంతో భూమి లోపల సూక్ష్మజీవులు నశించిపోతున్నట్లు శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలింది. గతంలో ఒక గ్రాము మట్టికి కోట్లాది సూక్ష్మజీవులు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య లక్షల్లో పడిపోయింది. పంటల పెరుగుదలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు నశించడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియదున్నడంతో తిరిగి సూక్ష్మజీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉందని వ్యవసాయాధికారి మణిదీప్ తెలిపారు. సహజంగా చౌడు బారిపోయిన భూముల్లో జీలుగ చేసుకుంటే భూమి భూసారం పెరిగి పంటకు అనుకూలంగా మారుతుంది.

యోగా దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 31న, జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలోని ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. యోగా నిర్వహణ కార్యక్రమం కోసం గంగాధర మండపం వద్ద విశాలమైన వేదికను ఏర్పాటు చేయాలని, తగినట్టుగా సౌండ్ సిస్టం ఉండాలని ఈఓ ఆదేశించారు. వేదిక ముందు గ్రీన్ మ్యాట్లు, ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరిశీలనలో ఈఈ మురళీబాలకృష్ణ, ఏఈఓ మల్లికార్జునరెడ్డి, డీఈఈ చంద్రశేఖరశాస్త్రి, ఇన్‌చార్జ్ సీఎస్ఓ ఎం.మల్లికార్జున, ఉద్యానవనాధికారి లోకేష్ పాల్గొన్నారు.

యోగా శిక్షణకు హాజరు కావాలి

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూలులో మంగళవారం నిర్వహించనున్న యోగా శిక్షణకు హాజరు కావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గాయత్రీ సూచించారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో యోగా ట్రైనర్స్‌గా రిజిస్ట్రేషన్ చేసుకున్న వాళ్లు శిక్షణకు హాజరు కావాలన్నారు. ఇద్దరు మాస్టర్ ట్రైనర్ల ద్వారా మండల స్థాయిలో శిక్షణ ఇస్తారన్నారు.